క్లుప్తంగా

మద్యం సీజ్: కేసు నమోదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగరం వినాయకనగర్ సర్కిల్ సమీపంలో దాడులు నిర్వహించి పుదుచ్చేరి ప్రాంతానికి చెందిన 25 మద్యం బాటిళ్లను ఒక వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ రెడ్డి తెలిపారు. వీఎన్ పల్లె మండలానికి ఆంతోనిరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నామని ఆయన వివరించారు.

తిరుగుబాటు మాసపత్రిక విడుదల

కడప ఎడ్యుకేషన్ : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘాల నాయకులు సంయుక్తంగా రూపొందించిన తిరుగుబాటు మాస పత్రికను కడప జిల్లా బీసీ సహాయ సంక్షేమ శాఖ అధికారి జ్యోతి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్రికలో విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, సామాజిక వేత్తలు, లౌకిక ప్రజాస్వామ్య వాదుల వ్యాసాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాయలక్ష్మమ్మ, గణేష్, శ్రీనాథ్, అనిల్, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తులసీ నాగప్రసాద్

కడప అర్బన్ : చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై ఎస్ఐ తులసీ నాగప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి వుండాలని, యూనిఫామ్ ధరించాలని, క్రమశిక్షణతో ఆటో నడపాలన్నారు. అతి వేగంతో డ్రైవింగ్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌కు గుర్తింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీపీటీడీ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్‌కు గుర్తింపు నిస్తూ ప్రభుత్వం మంగళవారం జీఓ నెంబర్ 97 విడుదల చేసిందని ఆ యూనియన్ నాయకులు రఘురాంగౌడ్, ఏఎస్ రెడ్డి, ఏఆర్ మూర్తి తెలిపారు. యూనియన్‌కు గుర్తింపు వచ్చేందుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జెండా మోసిన వారికే ప్రాధాన్యమివ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలో, రాష్ట్రంలో పార్టీని వీడకుండా జెండా మోసిన వారికి అధిష్టానం పెద్దపీట వేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లను భరించి, ఎన్నో కేసులు మీద వేసుకున్న వారికి సముచిత న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పాలగిరి శివ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కడప టూటౌన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్



విజిబుల్ పోలీసింగ్‌ను నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ సయ్యద్ హాసం

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌస్ నగర్, మాసాపేటలో మంగళవారం సాయంత్రం సీఐ సయ్యద్ హాసం, ఎస్ఐ సంజీవరాయుడు సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు వాహనాలు రోడ్లపై పెట్టకుండా పార్కింగ్ స్థలంలో పెట్టుకోవాలని సూచించారు. దుకాణదారులు రోడ్డుపైన అడ్డంగా వాహనాలు పెట్టకుండా చూసుకోవాలన్నారు.

నేటి నుంచి ఫీజు చెల్లింపు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు నోటిఫికేషన్ జారీచేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. 2020 విద్యాసంవత్సరానికి చెందిన విద్యార్థులు ఈనెల 13వ తేదీ నుంచి ఫీజు చెల్లించాలని సూచించారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

ప్రొద్దుటూరు : మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని మెప్మా పీడీ సురేష్ రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలో డ్వాక్రా మహిళలు నూతనంగా ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత లాంటి పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకుని తమ కాళ్లపై తాము నిలబడుతున్నారన్నారు.

గణపతి వేడుకకు.. నగరం సిద్ధం



బెల్లంమండీలోని విఘ్నేశ్వరుడి ఆలయం



ఎన్జీఓ కాలనీలో నిర్మాణంలో ఉన్న భారీ పందిరి

కడప కల్చరల్ : ఆది దేవుడు గణనాథుడి ఉత్సవాలకు కడప వీధులు సిద్ధమవుతున్నాయి. వినాయక చవితికి మరో నాలుగు రోజుల వ్యవధి ఉండడంతో పందిళ్లు వేసి విగ్రహం ప్రతిష్ఠించేందుకు యువత ఉత్సాహపడుతోంది. నగరంలో ఏటా 300కు పైగా విగ్రహాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ ఏడాది చిన్న చౌక్ లోని వీరాంజనేయ స్వామి ఆలయం, స్థానిక రాజీవ్ మార్గ్‌లోని పార్కు వద్ద భారీ పందిళ్లు ఏర్పాటుచేస్తున్నారు. మరిన్ని చోట్ల పందిళ్ల నిర్మాణం పూర్తికాక ముందే దాతల సాయంతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల నుంచి భారీ గణపతుల విగ్రహాలు తెప్పించారు. జిల్లా కేంద్రంలో కలకత్తా, ఒడిషా కార్మికులు విగ్రహాలకు మెరుగులు దిద్దుతున్నారు.

పెరిగిన వ్యయం

గణపతి ఉత్సవాల నిర్మాణ వ్యయం గత ఏడాది కంటే 30 శాతం పెరిగింది. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు పెరిగినా ఆలోచించకుండా దాతల విరాళాలతో భారీ విగ్రహాల ఏర్పాటుకు రూ.2 నుంచి రూ.3లక్షలు వెచ్చిస్తున్నారు. గణపతి నవరాత్రుల్లో వీధి వాసులంతా ఒకే కుటుంబంగా మారి కలసిమెలసి ఉత్సవాలు నిర్వహిస్తారు. తమ ప్రాంతాల్లో గణపతి ఉత్సవాల నిర్వహణ గురించి ఇప్పటికే బ్యానర్లు, హోర్డింగులు ఏర్పాటు చేశారు.

ఆది దేవుడికి తొలి ఆలయం

నగరంలో తొలి ఆలయంగా ప్రసిద్ధి గాంచిన ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయం ఈ ఏడాది ఉత్సవాలకు సిద్ధమవుతోంది. కడప నగరంలోని బెల్లంమండీలో గల ప్రసన్న విఘ్నేశ్వరస్వామి సన్నిధిని ప్రాచీన ఆలయంగా భావిస్తారు. 1984లో ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో 17వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 17న ఆదివారం సాయంత్రం 4 గంటలకు మంగళగౌరీ పూజ, 5గంటలకు వడిబియ్యం సమర్పణ, అనంతరం స్వామి కల్యాణంకోసం పసుపు దంపుడు కార్యక్రమం ఉంటాయన్నారు. 18న ఉదయం 5 గంటలకు మూలమూర్తికి పంచామృతాభిషేకం, సాయంత్రం 6 గంటలకు విశేష అలంకారం ఉంటాయని తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో మహాగణపతి హోమం, సాయంత్రం 5 గంటలకు సామూహిక కుంకుమార్చన రాత్రి 7గంటలకు స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోళ్ల ఉత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు సిద్ధి బుద్ధి సమేత వినాయక స్వామి కల్యాణం, అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 3 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమం, రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం ఉంటాయన్నారు.

కరుణించు మాత.. విజయదుర్గాదేవి



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయం మంగళవారం విశేష భక్తులతో కిటకిటలాడింది. కరుణించు మాతా.. విజయదుర్గాదేవి అంటూ అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే బారులు తీరారు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయనే విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా పండితులు మూలమూర్తికి విశేష అభిషేకం చేసి అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకేతు పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్ ఖాన్

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగావకాశాల కోసం విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు. కడపలోని మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మను) పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ హాకీముద్దీన్, కో ఆర్డినేటర్ మీర్జా విలయత్ అలీ, కన్వీనర్ మహమ్మద్ సిఖిందర్ హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతినగర్‌లో సీసీ దారులు నిర్మించాలి



ఎంపీ అవినాష్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ప్రకృతి నగర్ వాసులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివారున ఊటకూరు పరిధిలోని ప్రకృతి నగర్‌లో సీసీ రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని ఎంపీ అవినాష్‌రెడ్డికి కాలనీ వాసులు మంగళవారం విన్నవించారు. పులివెందులలో ఆయనను స్వయంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాలనీలో సీసీ దారి లేక చిన్నపాటి వర్షం కురిసినా ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారుతోందని ఆయన దృష్టికి తెచ్చారు. ఊటకూరు చెరువు సుందరీకరణ చేయాలని ఎంపీని కోరారు.

ఐక్య పోరాటాలతోనే పింఛన్ సాధన



మాట్లాడుతున్న యూనియన్ నేత రఘునాథరెడ్డి

కడప కల్చరల్ : ఐక్య పోరాటాలతోనే ఎల్ఐసీ సిబ్బందికి 30శాతం ఫ్యామిలీ పింఛన్ సాధించగలిగామని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, పింఛనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి సుధీకర్ అన్నారు. ఉపాధ్యక్షుడు అక్బర్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 11 నుంచి ఫ్యామిలీ పింఛన్ అమలు చేసేందుకు కేంద్ర ఆర్థిక శాఖ గెజిట్ విడుదల చేయడం హర్షణీయమన్నారు. సర్వీస్‌లో చివరి నెల జీతం ఆధారంగా సిబ్బంది పింఛన్ నిర్ణయించాలన్నారు. రాబోయే రోజుల్లో క్లాస్1, క్లాస్ 2 సిబ్బందితో కలిసి పోరాడి తమ సమస్యలను పరిష్కరించుకుంటామని తెలిపారు. అనంతరం యూనియన్ నేత ఎస్ఎం.సుందరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్, అమీనా పర్వీన్, రాజు, నజీరుల్లా, కుమార్, శ్రీకృష్ణ, వసుప్రద, శ్రీవాణి, జయచంద్ర, రఘు, ఎల్లయ్య, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రూ.47 కోట్ల విద్యుత్తు బకాయిలు



మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ జనరల్ మేనేజర్ ధర్మజ్ఞాని

కడప కార్పొరేషన్ : జిల్లాలో రూ.47 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, పూర్తిస్థాయిలో వసూలుచేయాలని ఏపీఎస్‌పీడీసీఎల్ జనరల్ మేనేజర్ ధర్మజ్ఞాని ఆదేశించారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అధికారులతో కడప విద్యుత్తు భవన్‌లోని సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ధర్మజ్ఞాని మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. బిల్‌స్టాప్ సర్వీసులు, విద్యుత్ చౌర్యంపై వేసిన అపరాధ రుసుము, డెవలప్‌మెంట్ ఛార్జీలు, మొండి బకాయిల రూపేణ బకాయిలు పేరుకుపోయాయన్నారు. వినియోగదారులు సమస్యలతో కార్యాలయాలకు వచ్చినపుడు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. బిల్లులపై వచ్చే వ్యత్యాసాలను అధిగమించడానికి ఆధునిక పద్ధతిలో ఐఆర్‌డీఏ పోర్టు ద్వారా ఆటోమేటిక్ రీడింగ్ తీసే విధానాన్ని అమలుచేయాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి కార్పొరేట్ ఆఫీస్ ఏఈఓ శ్రీధర్, జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ రమణ, ఏఓ మధు, ఎస్ఏఓ మధు, ఏఓ మల్లికార్జున్, కడప డివిజన్ ఈఈ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

పింఛనర్ల భవనానికి స్థలాన్ని కేటాయించాలి



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పింఛనర్ల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్ : భవనం ఏర్పాటుకు కొంత స్థలాన్ని కేటాయించాలని పింఛనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి కోరారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను కడప క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప తహశీల్దారు భవనం గోడను పడగొట్టి గతంలో జిల్లా కలెక్టర్లు కల్పించిన హక్కును కాలరాస్తూ కొందరు తమను వేధిస్తున్నారన్నారు. స్పందించిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన వారి హక్కులను కాపాడటం బాధ్యతగా భావిస్తామన్నారు. కలెక్టర్ విజయరామారాజుకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎల్లారెడ్డి, సంఘ కోశాధికారి నాగేష్, ఉపాధ్యక్షుడు సుబ్బయ్య, రెడ్డెయ్య, శంకరయ్యలతోపాటు ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు లెక్కల కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అన్ని శాఖల అధికారులతో మోడల్‌టౌన్ అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడల్‌టౌన్ అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. పనుల్లో అలసత్వం వహించకుండా శరవేగంగా పూర్తి చేయాలన్నారు. నగరవనం, బోలేవార్డు, సిటీ సెంటర్, శిల్పారామం, రింగురోడ్డు, రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత అధికారులు అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మోడల్‌టౌన్‌లో భాగంగా చేపడుతున్న 28 అంశాలకు సంబంధించి ఏయే పనులు ఎంతవరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్ పాల్గొన్నారు.

పేదల కోసమే సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : పేదల కోసం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, మరోసారి ముఖ్యమంత్రిని చేసేలా ప్రజలు దీవించాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా కోరారు. స్థానిక 48వ డివిజన్‌లోని రామరాజుపల్లి, నాగార్జున మోడల్ స్కూల్ ప్రాంతాల్లో ఇంటింటా తిరిగి రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి, వారి లబ్ధి సమాచారంతో కూడిన బుక్‌లెట్ అందజేశారు. తన కుటుంబానికి జగనన్న విద్యా దీవెన, వైఎస్ఆర్ ఆసరా, జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ సున్నా వడ్డీ, వసతి దీవెన, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా తన కుటుంబానికి రూ.11.65 లక్షల లబ్ధి చేకూరిందని కె.మనోహర్ ఆనందం వ్యక్తం చేశారు. తనకు రూ.9.56 లక్షల లబ్ధి చేకూరిందని సి.సంజీవమ్మ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు మాసూం బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారునాగయ్య, బీహెచ్.ఇలియాస్, బాలస్వామిరెడ్డి, మియ్యా, తోట క్రిష్ణ, పస్తం అంజి, పవర్‌అల్తాఫ్, రామ్మోహన్‌రెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, మనోజ్, రహీం, సుశీలమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

భూ వివాదంపై కేసు నమోదు

కడప అర్బన్ : భూములు మహిళకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పి.రాజా తెలిపారు. కడప నగరంలోని చిన్నచౌక్ పొలంలో ముత్తరాసపల్లెకు చెందిన అలివేలమ్మకు 45 సెంట్ల స్థలం ఉంది. దీనిని మహేశ్వర్‌రెడ్డితో పాటు, మరో ముగ్గురు కాజేసేందుకు ప్రయత్నించారు. కడప తహశీల్దారు తమకు 45 సెంట్ల స్థలాన్ని కేటాయించారని నకిలీ పత్రాలు సృష్టించి, ఐటీఐ సర్కిల్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇది తెలుసుకున్న బాధితురాలు అలివేలమ్మ కడప తహశీల్దారు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప తహశీల్దారు శివరామిరెడ్డి విచారించగా మహేశ్వర్‌రెడ్డికి, అతని తరుపు వ్యక్తులకు ఆ స్థలాన్ని తాను కేటాయించలేదని పేర్కొన్నారు. దీంతో కడప తాలూకా సీఐ పి.రాజా కేసు నమోదు చేశారు.

ప్రతి అర్హుడు ఓటు హక్కు పొందాలి

ఒంటిమిట్ట : బతికి ఉండగానే తాను చనిపోయానంటూ జెడ్పీ సీఈఓ కార్యాలయం నుంచి పరిశీలనకు మైగ్రేటెడ్, డెత్ వెరిఫికేషన్ లిస్ట్ వచ్చిందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ గీతా దేవి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన రాజంపేట ఎమ్మెల్యే మేడాకు విషయాన్ని తెలియజేశారు. ఈ విషయమై మండల తహసీల్దార్ మాధవీలతను సీరియస్‌గా తీసుకుని ఇలాంటి తప్పిదాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలం ప్రతి అర్హుడికి ఓటు హక్కు ఉండాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఇలాంటి పొరపాట్లు దొర్లకుండా బీఎల్ఓలు, వీఆర్ఓలకు జాగ్రత్తలు తెలియజేయాలని తహసీల్దారుకు ఎమ్మెల్యే తెలియజేశారు. కాగా మండలంలో 1100 పైచిలుకు ఓట్లు తొలగించాలంటూ వివిధ కారణాలుగా ఫిర్యాదులు అందగా అందులో 50 శాతం బతికి ఉన్న వారినే చనిపోయినట్టు ఫిర్యాదులు అందినట్టు తెలుస్తోంది.

పక్కా గృహాల లక్ష్యాలను పూర్తి చేయాలి

సిద్దవటం : మండలంలోని జగనన్న లేఔట్‌లలో పక్కా గృహాల లక్ష్యాలను త్వరితగతిన పనులను పూర్తి చేయించాలని అధికారులకు ఎంపీడీఓ జవహర్‌బాబు సూచించారు. మండలం కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్, ఆడుదాం ఆంధ్రా, బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించుట కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వారంవారం మండలానికి కేటాయించిన హౌసింగ్ స్టేజి కన్వర్షన్ పనులను లబ్ధిదారులతో త్వరితగతిన పూర్తి చేయించేందుకు సచివాలయ సిబ్బంది ముఖ్య కార్యదర్శులు, వీఆర్ఓలు, ఇంజనీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సహకరించాలన్నారు. అలాగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి నిర్వహించబడే క్రీడలకు క్రీడాకారులను పంచాయతీ కార్యదర్శులు ఫిజికల్ డైరెక్టర్‌లతో సమన్వయం చేసుకొని జాబితాలను సచివాలయాల వారీగా పంపాలన్నారు. బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరిని తిరిగి పాఠశాలలో చేర్పించే కార్యక్రమంలో ఎంఈఓ, హెడ్‌మాస్టర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

కార్మికశాఖలో అక్రమాలు

టీడీపీ హయాంలో స్కాంను వెలికితీయాలి



విలేకరులతో మాట్లాడుతున్న బూసిపాటి కిశోర్

కడప కార్పొరేషన్ : టీడీపీ హయాంలో కార్మికశాఖలో అక్రమాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ నాయకుడు బూసిపాటి కిశోర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కంటే ఇది పెద్ద కుంభకోణమన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మందుల కొనుగోలు విషయంలో అవినీతి జరిగిందన్నారు. మందుల ధరలను నాలుగు రెట్లు పెంచుకుని అవినీతికి పాల్పడ్డారని, తమ కమీషన్ల కోసం నాణ్యత ని పరికరాలు కొనుగోలు చేశారని ఆరోపించారు. బినామీ ఏజెన్సీలతో మందులు కొనకపోయినా బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. ఈ అక్రమాల వెనుక అప్పటి మంత్రులు అచ్చెన్నాయుడు, పితాని సత్యనారాయణ ఉన్నారన్నారు. హైదరాబాద్‌లోని నారా లోకేష్‌కు సంబంధించిన ఏజెన్సీ పేరుతో ఈ అక్రమాలకు పాల్పడ్డారని, అవినీతి వెనుక చంద్రబాబు హస్తం ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. గతంలో ఈఎస్ఐ అక్రమాలపై తూతూ మంత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకొన్నారన్నారు. విచారణ చేపట్టి కార్మికుల సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు కార్మిక మంత్రి గుమ్మనూరు జయరాం, కేంద్ర కార్మికశాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం



జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను కలిసిన ఏపి ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు

కడప అర్బన్ : ఉద్యోగులకు ఎల్ల వేళలా అండగా ఉంటాయని వైఎస్ఆర్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌అన్నారు. కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. ప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్ కలిసి మంగళవారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాసులు, నిత్య పూజయ్య, చిన్నయ్య, శైలేశ్వర్‌రెడ్డి, పద్మనాభం, వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, దేవేంద్ర, శివారెడ్డి, నరసింహారెడ్డి, కాటమయ్యపాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ధర్నా



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక రుసుము వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. సౌకర్యాలు సరిగా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెంచలయ్య, నాయకులు అశోక్, ఆదిత్య, చరణ్, చంద్రశేఖర్, అభిరానందన్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఈ- పంట వివరాల నమోదు

సిద్దవటం : మండలంలోని టక్కోలి రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు సలహాలు చేశారు. అంతేగాకుండా ఎరువుల పంపిణీ, ఈ - పంట నమోదు రిజిస్టర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ గోడౌన్‌లో రసాయనిక ఎరువులను పరిశీలించామన్నారు. యూరియా 228 బస్తాలు, 14:35:14 11 బస్తాలు ఎరువులు ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు ఈ ఎరువులను పొందవచ్చునన్నారు. ఇప్పటికే ఈ - పంట నమోదు చేసిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, నీటి వనరులు, సాగువిధానం అమలు తదితర అంశాలను ఎంపిక చేసిన రైతుల పొలాలను సూపర్‌వైజరీ చెక్ చేయడం జరిగిందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానాలు, అమలు తీరు తెన్నులపై సదరు సిబ్బందితో చర్చించామన్నారు. మంగళవాండ్లపల్లెకు చెందిన ఆదర్శ రైతు నారపురెడ్డి యానాదిరెడ్డికి చెందిన మామిడి, జామ తోటలో ప్రకృతి వ్యవసాయ విధానాలు ప్రయోగాత్మకంగా చేపట్టాలని, ఫలితాలను తోటి రైతులకు వివరించి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని సూచించారు.